క్లుప్తంగా

బీడీ కార్మికులకు పనిదినాలు పెంచాలి



ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, బీడీ కార్మికులు

భైంసాటౌన్: బీడీ కార్మికులకు చట్టప్రకారం 26 రోజుల పనిదినాలు తప్పనిసరిగా కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.హరిత డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని శివసాగర్ బీడీ వర్క్స్ ఎదుట కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీడీ కార్మికులకు పలు కంపెనీ యాజమాన్యాలు నెలలో కొద్దిరోజులు మాత్రమే పని కల్పిస్తున్నాయని, దీంతో పని లేక నష్టపోతున్నారన్నారు. అలాగే సరిపడా ఆకు, తంబాకు ఇవ్వాలని, నాన్ పీఎఫ్ కార్మికులందరికీ పీఎఫ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

'మహిళా శక్తి సమ్మేళనం' జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మహిళా శక్తి సమ్మేళన సమితి బాధ్యులు

భైంసాటౌన్: భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలు, దేశ సమగ్ర అభివృద్ధిలో మహిళల పాత్ర అనే అంశాలపై చర్చించేందుకు నిర్వహించనున్న మహిళాశక్తి సమ్మేళనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మహిళా శక్తి సమ్మేళన సమితి జిల్లా బాధ్యులు రాజశ్రీ మాశెట్టివార్, వరలక్ష్మి, పంచపూల షిండే కోరారు. ఈ మేరకు కార్యక్రమ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. జిల్లాకేంద్రంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 11న నిర్వహించే కార్యక్రమానికి నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు విజయభారతి, సునీత రాంమోహన్, వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేద సంహిత ప్రజ్ఞభారతి హాజరుకానున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి మహిళలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

ముధోల్: మండలంలోని తరోడా గ్రామంలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మీ ఆలయంలో ఆదివారం నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే రాంరావుపాటిల్ రానున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం సాయంత్రం అమ్మవార్లను శోభాయాత్ర నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు సభ్యులు తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు

నిర్మల్‌టౌన్: మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని పట్టణ ట్రాఫిక్ ఎస్సై రాజశేఖర్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 40 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో రాజశేఖర్ మాటాడారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా అన్ని ధ్రువపత్రాలు వెంట తెచ్చుకోవాలన్నారు. కొందరు ట్రాఫిక్ చలాన్లు తప్పించుకునేందుకు, నంబర్ ప్లేట్ పెట్టుకోవడం లేదన్నారు. నంబర్ ప్లేట్లపై తప్పుగా రాసినా ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఇందులో ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరిస్తాం

భైంసారూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీపీ అబ్దుల్ రజాక్ అన్నారు. మండలంలోని ఇలేగాం ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. పాఠశాలలో వసతులపై ఆరా తీశారు. సమస్యలను ఎమ్మెల్యే రామారావుపటేల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. బీజేపీ నాయకులు బోస్లే బాజీరావుపటేల్, అప్పాల రాకేశ్, మాధవరావు ఉన్నారు.

బీసీ వసతి గృహం తనిఖీ

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని బాలుర వసతి గృహాన్ని తహసీల్దార్ శ్రీలత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులతోపాటు స్టోర్ రూము, సరుకులను శనివారం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులకు సూచించారు. వసతి గృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో శేఖర్ ఉన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులకు సర్వే



దరఖాస్తుదారుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

- క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన
- దరఖాస్తుల్లో తప్పిదాలపై రీసర్వే
- గ్యారంటీల అమలుకు చర్యలు



భైంసాలో వివరాలు సేకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

భైంసాటౌన్: రాష్ట్రప్రభుత్వం గ్యారంటీల అమలులో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తుల సర్వే కొనసాగుతోంది. వార్డులవారీగా సభలు ఏర్పాటు చేసి ఐదు గ్యారంటీలకు లబ్ధి పొందేందుకుగాను దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. పట్టణంలో మొత్తం 26 వార్డుల పరిధిలో 16,681 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో వాటిని నమోదు చేశారు. ప్రభుత్వం ముందుగా గృహజ్యోతిలో భాగంగా 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ.500కే సిలిండర్ అమలుకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా విద్యుత్ అధికారులు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అర్హులను గుర్తించేందుకు సర్వే చేపడుతున్నారు. దరఖాస్తు చేసుకున్నవారిలో కొందరు వివరాలు తప్పుగా నమోదు చేయడంతో మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలు సరిచేస్తున్నారు. భైంసా పట్టణంలో 3,060 దరఖాస్తుల్లో వివరాలు తప్పుగా ఉండడంతో ఈ మేరకు సర్వే చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

అమలు కోసం ఎదురుచూపు

ఇదిలా ఉండగా, ప్రజాపాలనలో ఆయా గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఎప్పుడు అమలు చేస్తారోనని ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా సిలిండర్ రూ.500కు అమలు చేస్తే ప్రయోజనం చేకూరుతుందని ఎంతోమంది పేదలు ఎదురుచూస్తున్నారు. ఇందుకుగాను ఇప్పటికే ఆయా గ్యాస్ ఏజెన్సీల్లో కేవైసీ అప్‌డేట్ చేయించుకుంటున్నారు. అవసరం లేదని అధికారులే చెబుతున్నా కొందరు ఏజెన్సీ నిర్వాహకులు తప్పుదోవ పట్టిస్తున్న కారణంగా ఏజెన్సీలకు పరుగులు తీస్తున్నారు. ఇక, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం సైతం అధికారులు వివరాలు సేకరిస్తుండడంతో త్వరలో లబ్ధి చేకూరుతుందని దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు.

27న బల నిరూపణ పరీక్ష

- డైరెక్టర్లకు నోటీసుల అందజేత
- చైర్మన్ రేసులో విఠాపూర్ డైరెక్టర్



గోనె గజ్జారాం, డైరెక్టర్ విఠాపూర్

కుంటాల: కుంటాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ సట్ల గజ్జారాంపై సొంత పార్టీకి చెందిన పలువురు పాలకవర్గ సభ్యులు అవిశ్వాసం ప్రకటించిన విషయం విదితమే. 13 డైరెక్టర్లకు గాను ఈనెల 5న ఏడుగురు డైరెక్టర్లు ఇన్‌చార్జి డీసీవో నర్సయ్యకు తీర్మానం ప్రతిని అందజేశారు. ఈనెల 27న బల నిరూపణ పరీక్ష నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. డీసీవో ఆదేశాలతో సిబ్బంది శనివారం డైరెక్టర్లకు నోటీసులు అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే చర్చలు

కుంటాల పీఏసీఎస్ చైర్మన్‌పై విఠాపూర్, లింబా(కె), లింబా(బి), కల్లూర్, బామ్ని(బి), దౌనెల్లి, ఓలా డైరెక్టర్లు ఇటీవల అవిశ్వాసం ప్రకటించారు. ఇందులో బీఆర్‌ఎస్ పార్టీకి చెందినవారే డైరెక్టర్లే అధికంగా ఉన్నారు. దీంతో శనివారం అర్లి(కె)లో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వద్ద జరిపిన చర్చలు విఫలమయ్యాయని తెలిసింది. ఆయన ఆదేశానుసారం ఆదివారం పార్టీ ముఖ్యులు కలిసి డైరెక్టర్లను ఒకతాటిపైకి తెచ్చి సమస్యను సద్దుమణిగేలా చూడాలని పలువురిని కోరినట్లు సమాచారం. డైరెక్టర్లు వినని పక్షంలో బలనిరూపణ పరీక్షలో 9 డైరెక్టర్లు మద్దతిస్తే విఠాపూర్ డైరెక్టర్ గోనె గజ్జారాం చైర్మన్‌గా ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చానీయాంశంగా మారింది.

కాంగ్రెస్‌లో చేరిక



తానూరు: పార్టీలో చేరినవారితో మాజీ ఎమ్మెల్యే

తానూరు: మండలంలోని మసల్గా గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. భైంసాలోని మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావ్ పటేల్ వారికి కండువా కప్పారు. కోఆప్షన్ సభ్యుడు గోవింద్‌రావ్ పటేల్, మొగ్లి మాజీ ఉప సర్పంచ్ హైమద్ హుస్సేన్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పలువురు బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏఐసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరగా కండువాలు కప్పారు. మాజీ జెడ్పీటీసీ మేడి నారగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ నరేశ్‌రెడ్డి, ధర్మారం మాజీ సర్పంచ్ కుర్మ రాజేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురాల లింగారెడ్డి, మునిపెల్లి మాజీ ఉప సర్పంచ్ రాంపెల్లి రమేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, మేర సంఘం మండల అధ్యక్షుడు పూసాల గోవర్ధన్, నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేశ్వర్, మాజీ సర్పంచ్ అట్ల రాంరెడ్డి,నాయకులు పాల్గొన్నారు.

భైంసా/లోకేశ్వరం: భైంసాలో మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్ సమక్షంలో శనివారం పలువురు కాంగ్రెస్‌లో చేరారు. లోకేశ్వరం మండలానికి చెందిన పలువురు పార్టీలో చేరారు. హవర్గ గ్రామంలోని నాయకుడు సాయారెడ్డి, వట్టోలి మాజీ సర్పంచ్ రాజేశ్వర్ అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి ఉపాధ్యక్షుడు నర్సింగ్ రావు, రాజురా మాజీ సర్పంచ్ ముత్తగౌడ్ నరేశ్, సీఏసీఎస్ డైరెక్టర్ సుధీర్‌రెడ్డి పండరిగౌడ్ పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు

కుంటాల: ఎన్నికల ఓటమితో కార్యకర్తలెవరూ అధైర్యపడవద్దని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అన్నారు. మండలంలోని అర్లి(కె)లో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల్లో కష్టసుఖాల్లో తోడుగా ఉండాలన్నారు. అనంతరం మాజీ సర్పంచులను సన్మానించారు. డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. సమావేశంలో జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, కుంటాల, నర్సాపూర్(జి) మండలాల కన్వీనర్లు పడకంటి దత్తాద్రి, పాపెన్ రాజేశ్వర్, ప్యాక్స్ చైర్మన్ సట్ల గజ్జారాం, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, సర్పంచుల సంఘం మండల కన్వీనర్ ప్రదీప్‌కుమార్, శంకర్‌గౌడ్, అశోక్‌రెడ్డి, రమణగౌడ్, మక్బుల్, చంద్యాల మురళీ, పోశెట్టి, కుమ్మరి భాస్కర్, భోజన్న, ఖదీర్, పెంట దశరథ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ హెల్పర్ చిన్న ప్రేమల(55) అనారోగ్యంతో జిల్లా ఆసుపత్రిలో శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న డీడబ్ల్యూవో నాగమణి లక్ష్మణచాందకు చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, టీచర్లు రాజామణి, పద్మ, లలిత తదితరులు ఉన్నారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన బిట్లింగ్ సంతోష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానిక జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయనతో కలిసి చదువుకున్న 1995–96 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు, మిత్రులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.40 వేల ఆర్థికసాయం అందజేశారు. సాయికృష్ణ, చక్రపాణి, సంజయ్, గణేశ్, భూషణ్ చారి, అనిల్, సాయిరాం, రవీందర్, సుధీర్, శ్రీధర్, గంగాధర్, జనార్దన్, నరేందర్, గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్



రేఖానాయక్‌ను సన్మానిస్తున్న కార్యకర్తలు

లోకేశ్వరం: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీకల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అని గుర్తుచేశారు. గ్రామగ్రామాన పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. అనంతరం రేఖానాయక్‌ను సన్మానించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం సుదర్శన్‌రెడ్డి, నాయకులు పండరిగౌడ్, నర్సయ్య, భైండ్ల సాయన్న, సుధీర్‌రెడ్డి, మహేందర్, ముత్తగౌడ్, అసిబొద్దీన్ పటేల్, ఆంజనేయులు, షఫీ హైమద్, రాంచందర్‌రావు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి



సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న గంగన్న

లక్ష్మణచాంద: దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా ఈనెల 16న చేపట్టనున్న గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న కోరారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సమ్మె పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న కేంద్రంలోని బీజేపీ సర్కారు రైతాంగం, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగిస్తుందని మండిపడ్డారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి, కనీస వేతనాలు నిర్ణయించే విధానానికి స్వస్తి పలికిందన్నారు. కార్మికులు కవిత, హిదా బేగం, లక్ష్మి, చుక్కమ్మ, సుశీల, వసంత తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

అలేఖ్యకు కొవ్వొత్తులతో నివాళి

ఖానాపూర్: ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన పట్టణానికి చెందిన అలేఖ్యకు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ర్యాలీ అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తంగా

సన్మానం

ఖానాపూర్: దేశ సరిహద్దులో 24ఏళ్ల పాటు విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఆర్మీ ఉద్యోగి అడ్వాల నగేశ్‌ను మస్కాపూర్ హైస్కూల్‌లో శనివారం సన్మానించారు. హెచ్‌ఎం నరేందర్, గ్రామస్తులు నారాయణ, గజేందర్, మహేందర్, గంగన్న, శివ, తదితరులు ఉన్నారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఐదోతరగతి ప్రవేశానికి ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 861 మంది విద్యార్థులు పరీక్ష రాయల్సి ఉండగా 36 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన

కుంటాల: ఆటోల్లో విద్యార్థులను పాఠశాలలకు క్షేమంగా తరలించాలని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. శనివారం మండలంలోని అర్లి(కె)61 జాతీయ రహదారిపై రోడ్డు నిబంధనలపై ఆటో డ్రైవర్లకు, విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఏఎస్సై రాందాస్ ఉన్నారు.

రైతులకు అవగాహన

ఖానాపూర్: మండలంలోని పాత తర్లపాడ్ గ్రామంలో శనివారం పసుపు రైతులకు డ్రీమ్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పసుపు పంట కోతతోపాటు డెమో ప్లాట్, కంట్రోల్ ప్లాట్ పద్ధతులపై వేర్వేరుగా తూకం వేసి వివరించారు. సొసైటీ సభ్యులు చిన్నయ్య, రవి, భూపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కుంటాల: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యాశాఖ సెక్టోరియల్ ఫైనాన్స్ అకౌంట్ ఆఫీసర్ సిద్ధ పద్మ సూచించారు. మండలంలోని కల్లూర్ కస్తూరిబా పాఠశాలను శనివారం సందర్శించి విద్యార్థులకు సూచనలు చేశారు. ఎస్‌వో సువర్ణ తదితరులు ఉన్నారు.

ఘనంగా మల్లన్న విగ్రహప్రతిష్ఠాపన

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామంలో మల్లన్న స్థిరయంత్ర విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. అర్చకుడు రేవంత్‌శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ఊరేగింపు, గంగనీళ్ల, పుట్టమన్ను సేకరణ, గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపస్థాపన తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పస్తం వంశీయులం తమ సొంత ఖర్చులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పస్తం గంగమల్లు, పస్తం నరేశ్ పేర్కొన్నారు.

గృహజ్యోతిపై సర్వే

కుంటాల: గృహజ్యోతి పథకంలో భాగంగా అర్హులను గుర్తించేందుకు అధికారులు సర్వే చేపడుతున్నారు. గ్రామాల్లో శనివారం సర్వే నిర్వహించారు. ఆధార్, కస్టమర్ నెంబర్, గ్యాస్ కంపెనీ వివరాలను సేకరించారు. ప్రత్యేక అధికారులు ఎజాజ్ అహ్మద్‌ఖాన్, దేవేందర్‌రెడ్డి, సోమలింగారెడ్డి, రహీం, ముత్యం, నరేశ్‌గౌడ్, అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాందలో కొలువుదీరిన వరసిద్ధి వినాయకుడు భక్తులతో పూజలందుకున్నాడు. భక్తుల కోర్కెలు తీర్చే వినాయకునిగా ప్రసిద్ధి చెందాడు. ఆలయ 13వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఏటా వసంత పంచమి సమయంలో 11,12,13 మూడు రోజుల్లో నిర్వహించే జాతరకు మండలం నుంచే కాక ఇతర జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు.

17న వేలం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం పక్కన గల ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి షాపులకు నెలవారీ కిరాయి ఇవ్వడానికి ఈనెల 17న వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హన్మాండ్లు ఓ ప్రకటనలో తెలిపారు. షాపు నంబర్ 3, 5, 10లకు వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.5వేల దరఖాస్తు రుసుము చెల్లించాలని వేలంలో పాల్గొనాలని సూచించారు. కుల, ఆదాయ, రేషన్, నివాస, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

రంగు డబ్బాలు విరాళం

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కస్బా ఉన్నత పాఠశాలకు 2001–02 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వవిద్యార్థులు శనివారం రంగు డబ్బాలు విరాళంగా అందజేశారు. పాఠశాలలో ఇటీవల నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ఆవరణ గోడలు పెచ్చులూడి ఉండడంతో విద్యార్థులు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వాణి వారిని అభినందించారు. పూర్వ విద్యార్థులు చాట్ల శ్రీనివాస్, బి శ్రీనివాస్, గణేష్, శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వరి పంటపై అవగాహన



వరినాట్లు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సోన్: మండలంలోని గంజాల్ యూపీఎస్ పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థులకు వరి పంటలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గ్రామంలోని పొలం వద్దకు తీసుకెళ్లారు. వరి నాట్లు వేశారు. హెచ్‌ఎం రమేశ్‌బాబు, ఉపాధ్యాయులు సునీత, రత్నమాల, రమీల, ప్రవళిక ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు ఉపాధ్యాయులు

సోన్: మండలంలోని పాక్‌పట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 41 మంది టెన్త్ విద్యార్థులకు రూ.20వేల విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను అమెరికాలో స్థిరపడ్డ పాక్‌పట్ల గ్రామ వాస్తవ్యుడు నక్కల హన్మంత్‌రెడ్డి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. అనంతరం వారిని సన్మానించారు. హెచ్‌ఎం వెంకన్న, గ్రామ కార్యదర్శి సంధ్యారాణి, నక్కల నర్సమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'వీడీసీ కక్ష సాధింపు చర్యలు'

నిర్మల్‌టౌన్: తనపై వీడీసీ సభ్యులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ వేధింపులకు గురిచేస్తున్నారని సర్పంచుల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు, సోన్ మాజీ సర్పంచ్ వినోద్ ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని విశ్రాంతి భవనంలో శనివారం ఆయన మాట్లాడారు. తాను గ్రామ అభివృద్ధి నిధులు దుర్వినియోగం చేశానని కలెక్టర్, తహసీల్దార్, ఎంపీడీవోలకు సోన్ వీడీసీ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. గత ఐదేళ్లుగా సర్పంచ్‌గా గ్రామానికి సేవలందించానని తెలిపారు. కొందరు గ్రామ వీడీసీ సభ్యులు తనపై వ్యక్తిగత కక్షతో ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసినట్లు నిరూపిస్తే తాను ఏ శిక్షకైనా సిద్ధమన్నారు.

వైభవంగా పల్లకిసేవ

నిర్మల్‌టౌన్: దేవరకోట శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. పల్లకిలో ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామంలో కేంద్ర పథకాలపై శుక్రవారం రాత్రి బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి వివరించారు. కేశెట్టి అశోక్‌కుమార్, సూర్యవంశీ సాయినాథ్, ఎంపీటీసీ సుధాకర్, రాజు, రమేశ్, విఠల్ పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చన

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయ 27వ వార్షికోత్సవంలో భాగంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. పండితులు రామకృష్ణశర్మ, మల్లేశం, శశిధర్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేందర్, ప్రధాన కార్యదర్శి కొక్కుల ప్రదీప్, కోశాధికారి శేఖరయ్య ఉన్నారు.

షీటీం సేవలపై అవగాహన

నిర్మల్‌టౌన్: ఎవరైన వేధింపులకు గురిచేస్తే 100 డయల్‌కు ఫోన్ చేయాలని షీటీం ఎస్సై సుమంజలి పేర్కొన్నారు. జిల్లా కేంద్రం మంజులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శనివారం షీటీం సేవలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, టోల్ ఫ్రీ నెంబర్ 1930 వంటి అంశాల గురించి వివరించారు. షీటీం ఎమర్జెన్సీ నెంబర్ 8712659550కు ఫోన్ చేయాలని సూచించారు. ఇందులో షీటీం పోలీసులు ఉన్నారు.

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం షీటీం సేవలపై అవగాహన కల్పించారు. షీటీం సిబ్బంది రమాదేవి రాధిక, హెచ్‌ఎం సిద్ధ పద్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అఖండ హరినామ సప్తాహం

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో శనివారం అఖండ హరినామ సప్తాహం ప్రారంభమైంది. ఉదయం జ్ఞానేశ్వరి పారాయణం, మధ్యాహ్నం గాత భజన, రాత్రి కీర్తన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గ్రామాల వార్‌కరి భక్తులు తరలివచ్చారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సప్తాహ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ఫేర్‌వెల్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని దీక్ష జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. హాస్టల్ కార్నివాల్–2024 పేరిట నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. డీఐఈవో జాదవ్ పరశురాం, కడెం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, నిర్మల్ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవి కిరణ్, ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, డైరెక్టర్ ప్రమోద్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు గృహజ్యోతి దరఖాస్తుల పరిశీలన

భైంసాటౌన్: 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ కోసం గృహజ్యోతిలో భాగంగా వచ్చిన దరఖాస్తులను ఆదివారం పరిశీలించనున్నట్లు ఏడీఈ ఆదిత్య ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కిసాన్‌గల్లి పాత మున్సిపల్ బిల్డింగ్, మదీనాకాలనీలోని ముస్లిం ఫంక్షన్ హాల్, ఓవైసీనగర్, నర్సింహా కల్యాణ మండపం, గణేశ్‌నగర్ మున్నూరుకాపు సంఘంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని, విద్యుత్ సిబ్బంది ఈ మేరకు దరఖాస్తులు పరిశీలిస్తారని పేర్కొన్నారు.